# సమస్తము భగవంతుని వరప్రసాదమే

బ్రహ్మజ్ఞానంబు నెరుగక బ్రాహ్మణుండ
సమత భావము లేకున్న సజ్జనుండ
మంచితనమును లేకున్న మానవుండ
చెప్పరండయ్య మీరలె ఒప్పుకొంద.

**విద్యార్థులారా!**

ప్రపంచమునందుగల సమస్త పదార్థములు భగవత్ వరప్రసాదములే. సంకల్ప స్వరూపములే. కొన్ని పదార్థములను మనము అతి జాగ్రత్తగా ఉపయోగపెట్టుకోవలసివస్తుంది. వివేకంతో విచారణ జరిపి వినియోగం సలుపుకున్నప్పుడు ఆ పదార్థములు మనకు ప్రాణమిత్రునిగా తోడుగా ఆనందాన్నందిస్తాయి. విచారణ సలుపక వివేకరహితమైన భావముతో ఆ పదార్థములను వినియోగించుకున్న శత్రువుల వలె మనల్ని హింసిస్తాయి. కనుక ప్రతి పదార్థమును విచారణ సల్పి వివేకముతో వినియోగించుకొనుటకు ప్రయత్నించాలి.

మచ్చునకు అగ్ని ఉంది. కత్తి ఉన్నది. కరెంటు ఉన్నది. వీటిని సరైన మార్గములో వినియోగించుకున్నప్పుడే వీటి ఫలితమును మనము అందుకోగలుగుతాము. అగ్ని అతిజాగ్రత్తగా ఉపయోగించుకొనకున్న అది మనకు ప్రమాదము కలిగింపచేస్తుంది. కత్తిని సమయ స్ఫూర్తిగా వినియోగించుకున్నప్పుడే అది మనకు సహాయకారిగా ఉంటుంది. కరెంటు కూడను మనకు అనేక విధములైన ఉపకారములు సలుపుతున్నది. బల్బులు వెలిగించుకొని తద్వారా వెలుతురు నందుకో గలుగుతున్నాము. ఫ్యాన్ అమర్చుకొని గాలిని పొందగలుగుతున్నాము. స్టౌలో కరెంటు ప్రవేశపెట్టి వంటను చేసుకుంటున్నాము. ప్రింటింగ్ ప్రెస్‌లో దానిని ఉపయోగపెట్టుకొని అనేకరకములుగా సృష్టిని గావించుకుంటున్నాము. ఈ కరెంటు నాకింత ఉపకారం చేసిందికదా!

srisathyasaivachanamrutam

ఈ కరెంటు ద్వారా నేనెన్ని విధముల కార్యములనో సాధింప గలుగుతున్నాను. అని ఓ కరెంటా! నీవెంత మంచి మిత్రుడవు అని దానిని పట్టుకుంటే కాల్చి వేస్తుంది. ఈ ఉపకారములను మనము సరియైన విచారణ చేసి అనుభవించవలసి వస్తుంది. ఉపకారము చేసింది కదా అని కరెంటు పట్టుకోవటానికి వెళ్ళినప్పుడు అది మనకు ప్రమాదమునే చేస్తుంది.

అదేవిధముగనే మానవుని ఇంద్రియములన్నీ కూడను చాలా జాగ్రత్తగా ఉపయోగపెట్టుకోవాలి. ఈ ఇంద్రియములను సక్రమ మార్గములో ప్రవేశపెట్టినప్పుడు మనకు సహాయకారులుగా ఉంటుంటాయి. వక్రమార్గములో ప్రవేశపెట్టినప్పుడు అనేక విధములైన బాధలు కలిగిస్తాయి. ఈ ఇంద్రియములలో జిహ్వ చాలా ప్రధానమైనది. ప్రమాదమైనది. ఒక్కొక్క ఇంద్రియమునకు ఒక్కొక్క శక్తి మాత్రము ఉంటున్నది. కాని ఈ జిహ్వకు రెండు రకములైన శక్తులుంటున్నాయి. ఒకటి మాటాడటం, రెండవది రుచి చూడటం. కనుకనే జయదేవుడు

**జిహ్వేరసజ్ఞేమధురప్రియత్వం సత్యం హితం త్వాం పరమం వదామి**
**ఆవరణమేకామధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి**

అని దానిని అనేక రకములుగా వర్ణిస్తూ వచ్చాడు. ఓరుచి తెలిసిన నాలుకా! మధురమైన మాటలాడే నాలుకా! గౌరవమైన నాలుకా! నీయొక్క దీనిపైన భగవంతుని వాక్యములు తప్ప అన్యములు నేను ఉపయోగపెట్టను. అటువంటి నాలుకను అపవిత్రంగావించటం నాకిష్టం లేదు. సత్యమునకే ఉపయోగించుకోవాలి. ప్రియమైన దానిని నేను ఉపయోగించుకోవాలి. అదేవిధముగనే భగవద్గీతయందు 'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితంచ అన్నారు. ఈ సత్యము కూడను ఉద్వేగకరంగా ఉండకూడదు. అన్ని విధములైన పవిత్ర గుణములు కలిగి ఉంటున్నది. కనుకనే నాలుకను మనము అతిజాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. ఈ నాలుక వల్లనే మనకు బంధమోక్షములు సంభవిస్తున్నాయి. శాశ్వత సుఖమును, శాశ్వత ఆనందమును అందించేది నాలుకనే. అన్ని ఇంద్రియములకంటె ఈ జిహ్వ చాలా ప్రధానమైనది, ప్రమాదమైనది. కనుకనే ఈ ఇంద్రియమును జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి.

srisatyasaivachanamrutam

ఇట్టి ఇంద్రియమును ఉపయోగించుకునే నిమిత్తమై ప్రాచీన ఋషులు అనేక విధములైన నియమములను పాటిస్తూ వచ్చారు. ఈ జిహ్వకు అడిగినవన్నీ అందించరాదు. జిహ్వ అడిగినవన్నీ అందిస్తూ వస్తే కట్టకడపట నిన్నే మ్రింగి వేయటానికి సిద్ధంగా ఉంటుంది. కనుకనే ఈ రుచులను అరికట్టే నిమిత్తమై ప్రాచీన ఋషులు కొన్ని నియమాలు పాటిస్తూ వచ్చారు. వాటినే చాతుర్మాసవ్రతములు అన్నారు. నాలుగు నెలలు ఈ జిహ్వకు సరియైన శిక్షణనిచ్చి తాను అడిగినవన్నీ అందించకుండా దీనిని సరియైన మార్గములో నిలపాలనే ఉద్దేశ్యముతో ఏర్పడినదే ఈ చాతుర్మాసవ్రతము. ఇప్పుడు వచ్చే ఆషాఢ మాసమునుంచి నాలుగు నెలలు ఈవ్రతమును పాటిస్తుంటారు. దీనికి మరొక కారణము కూడ లేకపోలేదు. ఇది వర్షాకాలము కనుక సన్యాసులు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశమునకు ప్రయాణము చేయటం చాలా కష్టముగా ఉంటుంది. వర్షముల వలన నదులు ప్రవహించవచ్చును. వంకలు పారవచ్చును. ప్రయాణమునకు ఆటంకమవుతుంది. కనుక ఒక్క ప్రదేశములో ఉంటుండి ఈ నాలుగు నెలలు దైవచింతన చేత కాలమును సార్థకము గావించుకోవాలని ఈ చాతుర్మాసవ్రతము ప్రారంభించారు. అరణ్యమునకేగి క్కడే ఒక పాక నిర్మించుకొని ఈ పాక లోపల తపస్సును గావిస్తూ వచ్చారు. అక్కడ కందమూలాలు తప్ప ఎట్టి రుచిపదార్థములు లభించవు. కందమూలాదులు చేతనే కాలమును సార్థకము గావించుకొని జిహ్వయొక్క రుచివాసనలను అణగద్రొక్కుతూ వచ్చారు.

**ఇంద్రియ నిగ్రహం పాటించండి**

దురదృష్టవశాత్తు ఈ కలియుగములోపల చాతుర్మాసవ్రతములు ప్రత్యేకముగా ఆర్భాటమైన ఒక విందుగా చేస్తున్నారు. నిత్యము రుచికరములైన పదార్థములు కావాలి. ఒక్కొక్కదినము ఒక్కొక్క భక్తుడు వీరికి విందునందించాలి. దీనిని భిక్ష అనే రూపములో అనుభవిస్తున్నారు. ఈ విధముగా కాలము మారుకొలది పవిత్రమైన భావాలు కూడను అపవిత్రమార్గములో ప్రవేశపెడుతున్నారు. ఇలాంటి వ్రతములన్నీ జిహ్వచాపల్యమును అణగద్రొక్కే నిమిత్తమై ఏర్పడినవనే సత్యాన్ని ఈనాటి సన్యాసులు గుర్తించుకోలేకపోతున్నారు. ఇంద్రియములను అరికట్టలేకపోయినప్పుడు మీరు ఏవిధంగా దివ్యత్వాన్ని అందుకోగలరు? అనుభవించగలరు? ఇల్లు కాలుతుంటే బయటకు వచ్చి దూరంగా పరుగెత్తవచ్చు. ఇంటికి

srisathyasaivachanamrutam

నిప్పంటుకుంటే మరొక ప్రదేశమునకైనా పరుగెత్తవచ్చు. ఇంద్రియాలకే నిప్పటుకుంటే ఇంకెక్కడ పరుగెత్తటానికి వీలవుతుంది. ఈనాటి పరిస్థితిలో సాధకుల ఇంద్రియాలకి నిప్పంటుకుంటుండాది. ఇంక దీన్ని మనం ఏవిధంగా వర్ణియించటానికి వీలవుతుంది. మనిషికి జ్వరం వచ్చిందంటే ఎంత ఉందో ధర్మామీటరు పెట్టి నిర్ణయించవచ్చు. కాని ధర్మామీటరుకే జ్వరమొస్తే? ఈనాటి సాధువులు, సన్యాసులు తమకు తామే ఇంద్రియాలను ఉద్రేకపరచుకుంటున్నారు.

జెరూసలెంలో ఒక మందిరంలో పావురాల నమ్ముతున్నారు. జీసస్ అందులో ప్రవేశించి పవిత్రమైన దైవమందిరాలలో ఈవిధమైన వ్యాపారం జరగకూడదని ఖండించాడు. మతాధిపతులైన వారందరు ఒక్కటిగా చేరిపోయారు. ధర్మప్రబోధలు చేయటానికి నీకెక్కడ అధికారం ఉంది? నీ అధికారమేమిటో తెల్పమన్నారు. అప్పుడు జీసస్ ఒక కథ చెప్పాడు. ఒక రైతుకు ఇద్దరు కొడుకులుండేవారు. ఒకనాడు పెద్దకొడుకును పంట దగ్గరికి వెళ్ళి దానిని కాపలా కాయమని ఆజ్ఞాపించాడు. కానీ పెద్దకొడుకు నేను పోను నాకు వీలుకాదు అన్నాడు. సరే రెండవ కొడుకును ఆజ్ఞాపించాడు. నీవు పంటకు వెళ్ళి పశువులేమైనా చేరుతాయేమో కావలి కాయమన్నాడు. రెండవ కొడుకు వెళతానని వాగ్దానం చేశాడు. కొంతసేపైన తరువాత మొదటి కొడుకు వెళ్ళనని చెప్పినాడు గాని తండ్రి ఆజ్ఞను మీరటం మంచిది కాదని తానువెళ్ళినాడు. రెండవ కుమారుడు వెళతానన్నాడు గాని వెళ్ళలేదు. ఎక్కడో బజారుకు వెళ్లాడు.

అయితే ఇందులో ఎవరు తండ్రి ఆజ్ఞను నడచుకున్నవారు? మీరు చెప్పండి అన్నాడు. పెద్దవాడు తండ్రి ఆజ్ఞను శిరసావహించాడు. రెండవ కుమారుడు నేను వెళతానని చెప్పాడుగాని వెళ్ళలేదు. ఈనాటి పండితులందరు ఇదేస్థితిలో ఉంటున్నారు. శాస్త్రమనే తండ్రి బోధించిన దానిని మేము ఆచరిస్తామని ప్రోమిస్ చేస్తున్నారు. ఆచరించకుండా ఆ తండ్రియైన భగవంతుని వాక్యానికి విరుద్ధంగా నడచుకుంటున్నారు. కనుక మీరందరు ఇలాంటివారే అన్నాడు జీసస్. దీనితో పండితులందరికి కోపం వచ్చింది. ఇంకా అనేక అనేక కారణాలంతా కల్పించుకొని రాజనీతికి విరుద్ధంగా నడుస్తున్నాడని అనేక రకములైన పాయింట్లు అంతా చూపించి అతనిని చెరసాలలో పెట్టటానికి ప్రయత్నించారు.

srisathyasaivachanamrutam

నిజముగా 'సత్యం జన విరోధాయ అసత్యం జనరంజనం' సత్యమనేది ఈనాడు విరోధంగా ఉంటుండాది ఈలోకానికి. అసత్యమే అతిమధురంగా ఆనందముగా ఉల్లాసంగా ఒక విధమైన సత్యంగా కనుపిస్తుండాది. చెప్పటం ఒకటి చేయటము మరొకటి ఇది శాస్త్ర విరుద్ధమైనది. చెప్పే విషయములలో ఒకటి రెండైనా ఆచరించటానికి ప్రయత్నించినవాడే ఉత్తముడు. ఈ విధమైన ఆచరణను అభివృద్ధి పరచుకునే నిమిత్తమై ఆనాటి సాధువులు, సన్యాసులు అరణ్యవాసం చేస్తూ వచ్చారు. అనేక రకములైన యోగసాధనలు సలుపుతూ వచ్చారు. ఈ యోగములు దేనినిమిత్తమై చేస్తున్నాము? ఈ యోగమువల్ల భగవత్ప్రాప్తి ఏమైనా లభ్యమవుతుందా? కాదు. కాదు. కేవలము ఇంద్రియ నిగ్రహ నిమిత్తమై యోగములు ప్రారంభిస్తాము. దీనినే పతంజలి యోగఃచిత్తవృత్తి నిరోధకః అన్నాడు. ఈ చిత్తవృత్తిని నిరోధించటం చేత అధికకాలం జీవించవచ్చును. ఎవడు అధికకాలం జీవించాలి? సజ్జనుడు, సద్గుణములు కలవాడు, సదాచార సంపన్నుడు పవిత్రహృదయుడు, అధికకాలం జీవించినా జగత్తుకు ఉపయోగం ఉంటుంటాది. దుష్టులు, దుర్మార్గులు, దురాచారపరులు అధికకాలం జీవిస్తే దీనివల్ల జగత్తుకు అపకారమే జరుగుతుంది గాని ఉపకారం జరుగదు. కనుకనే సర్వసంగ పరిత్యాగులైన సాధకులే ఈవిధమైన యోగాభ్యాసాన్ని ఆచరించాలి అని ఒక నిర్ణయానికి వచ్చారు. అట్టి సాధకులు అధిక కాలం జీవించటం చేత సమాజమున కెంతైననూ ఉపకారం ఉంటాది. అప్పుడు దీనికి కొన్ని నియమాలు పాటిస్తూ వచ్చారు. ఇది పిల్లలు చాలా జాగ్రత్తగా వినాలి.

### చిత్తవృత్తి నిరోధమే యోగము

ఈ పాంచభౌతిక దేహమునకు కొన్ని నిబంధనలుంటున్నాయి. మనము తీసుకునే గాలి, విడిచేగాలి ఎంత సావధానంగా తీసుకుంటామో విడుస్తామో అంత అధికకాలము మనము జీవిస్తాము. మనయొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఎంతవేగంగా తీసుకుంటామో అంతత్వరలోనే మరణం ప్రాప్తిస్తుంది. దీనికి కొన్ని నియమాలుంటున్నాయి. ఏనుగు, మనిషి ఒక నిముషమునకు 12 లేక 13 పర్యాయములు ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుపుతుంటాయి. ఈనియమము అనుసరించటం చేత మానవుడు 100 సంవత్సరములవరకు బ్రతకటానికి వీలుంటుంది. పాము, తాబేలు ఇత్యాది జీవులకు నిముషమునకు 7, 8 పర్యాయములు మాత్రమే ఉచ్ఛ్వాస

sri sathyasaivachanamrutam

నిశ్వాసములు. కనుకనే పాము, తాబేలు 200 సంవత్సరములు, 300 సంవత్సరములు జీవించటానికి అవకాశము ఉంటున్నాది. కోతి కుక్క, పిల్లి ఇవన్నీ నిముషమునకు 30, 40 పర్యాయములు ఉఛ్వాస నిశ్వాసములు చేస్తూ ఉంటాయి. కనుకనే ఇవి చాలా త్వరగా 12, 13 సంవత్సరముల లోపలనే ప్రాణము విడుస్తాయి. కుందేలు ఉంటుందాది. ఇది ఒక నిముషమునకు 40, 50 పర్యాయములు ఉచ్ఛ్వాస నిశ్వాసములు వదలుతుంది. ఇది 5 లేక 6 సంవత్సరములు మాత్రమే జీవించగలుగుతుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఎంతవేగంగా పోతుందో జీవితం కూడను అంతవేగంగానే విరమించుకుంటుంది. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఎంతనిదానంగా జరుగుతూ ఉంటాయో అంత ఎక్కువకాలం మనం జీవించటానికి అవకాశము ఉంటుంది. ఈ శ్వాస ఎట్లా వదలాలి. మనకు బలమున్నది కదా అని గట్టిగా శ్వాసవదలరాదు. మనం చేతిలో పిండి పెట్టుకొని ఉంటే ముక్కు దగ్గర పెట్టుకున్నప్పుడు ఈ ఉచ్ఛ్వాసనిశ్వాసం గాలిని వదలే సమయంలో పిండికూడను కదలకూడదు. అంతనెమ్మదిగా వదలాలి. ఇట్టి శాంతముతో నిదానముతో ఉచ్ఛ్వాసనిశ్వాసములు జరగటానికి యోగాభ్యాసము కొంతవరకు ఉపయోగపడుతుంది. ఇది సాధించేనిమిత్తమై ఆనాటి ఋషులు అందరూ అరణ్యవాసం చేస్తూ వచ్చారు. వాక్శుద్ధి, ఇంద్రియ నిగ్రహము ఈవిధమైనవి సాధించే నిమిత్తమై అరణ్యాలకు పోయారుకాని వేరొక ఉద్దేశ్యములో పోలేదు.

**ధారణ - ధ్యానము - సమాధి**

ఇంకవీరు చేస్తున్న ధ్యానములు ఎలాంటివి? మొట్టమొదటిది ధారణ. 12 ధారణలు చేస్తే ఒక ధ్యానము అన్నారు. 12 ధ్యానములు చేస్తే ఒక సమాధి అన్నారు. ధారణ అంటే ఏమిటి? ఒక వస్తువును 12 సెకండ్లు ఎటూ చలించకుండా చూడటమే ధారణ. ఏదైనా ఒక ఫోటోనో, ఒక వస్తువునో, ఒక విగ్రహమునో పెట్టుకొని 12 సెకండ్లు కొంతటైమ్ పెట్టుకొని నీవు చక్కగా ప్రాక్టీసు చెయ్యి. 12 సెకండ్లు ఎటూపోనివ్వకుండా దృష్టి నంతా ఆ వస్తువుపైన పెట్టుకో. 12 సెకన్లే ఎక్కువకాలం కాదు. ఈ విధంగా ధారణ చేయటంచేత ధ్యానమునకు అవకాశమేర్పడుతుంది. 12 సెకన్లు మాత్రమే మనదృష్టిని ఒక వస్తువుపై నిలపాలి. ఇదే ధారణ. ధారణ తరువాత ధ్యానము. ఇది 12 ధారణలు అయినప్పుడే ఒక ధ్యానమైపోతుంది.



srisathyasaivachanamrutam

అనగా ఏమి? 12 X 12 = 144 సెకన్లు. 2 నిముషముల 24 సెకండ్లు. గంటల కొద్ది కూర్చోవటం కాదు ధ్యానము. సరియైన ధ్యానమైతే 2 నిముషముల 24 సెకండ్లు చాలు. ఈ ధారణను మనం చక్కగా ప్రాక్టీసు చేస్తూ వచ్చినప్పుడే ధ్యానమనే 2 నిముషముల 24 సెకన్లు చక్కగా నిల్చటానికి అవకాశమొస్తుంది. 12 ధ్యానములు ఒక్క సమాధి అన్నారు. అనగా 144 X 12 = 28 నిముషముల 48 సెకన్లు. ఇది సమాధి. ఇది గంట కూడాకాదు. ఇంత మాత్రమే సమాధి. ఎక్కువ కాలమైతే సమాధే. పోవటమే, ఇంక తిరిగి ప్రాణంరాదు. ఈ విధమైన క్రమశిక్షణను వారు పాటిస్తూ వచ్చారు.

ఈ క్రమశిక్షణ శాస్త్రాల్లోగానీ, ఏ పండితుడుగాని ఎక్కడా చెప్పలేదు. దీన్ని సాధించాలంటే మొట్టమొదట మనము ధారణలో ప్రవేశించాలి. ఈ ధారణ 12 సెకన్లు మాత్రమే చేస్తూరండి. ఇది పిల్లలకు చాలా అవసరం. పూర్వము అనేకమంది ఋషులంతా అరవిందఘోష్, రమణమహర్షి వీరందరు ఈ విధమై ప్రాక్టీసు చేసుకుంటు పోయారు. అరవిందు డటుంచి, రమణమహర్షి మాత్రము రాత్రి టెర్రస్ మీదకు పోయేవాడు. ఒక్క చుక్కపైన దృష్టి పెట్టేవాడు. ఆ చుక్కనే 12 సెకన్లు అలా చూస్తూ ఉండేవాడు. అప్పుడు ఈ మనసు కూడా అటు ఇటూ చలించేదికాదు. ఎక్కువకాలం కాదు. 12 సెకన్లు. ఈ విధంగా 12 సెకన్లు మనం ప్రాక్టీసు చేస్తూ వస్తే అలాంటి 12 ధారణలే ఒక ధ్యానముగా మారుతుంది. అంటే 144 సెకండ్లు మాత్రమే. 2 నిముషముల 24 సెకండ్లు మాత్రమే. ధర్మామీటరు లోపలపెట్టుకొని 2 మినిట్సు ఉంటామా లేదా? ఈ దృష్టిని అంతమాత్రం ఎందుకు నిల్పకూడదు? ఈ విధముగా మనము ప్రాక్టీసు చేస్తూ చేస్తూ తర్ఫీదు చేస్తూ, చేస్తూ, వస్తుంటే, నిజమైన సమాధి మనకేర్పడుతుంది. ఈ సమాధి అంతరార్థమేమిటి? అన్‌కాన్షసో లేక ఇంకేవిధమైన సూపర్ కాన్షసో ఏదో ఒక కాన్షస్ అని అనుకుంటారు ఇది ఏ కాన్షసూ కాదు. నిజమైన సమాధి అంటే ఏమిటి? సమాధి సమత్వాన్ని పొందే ధీనే సమాధి అన్నారు. సుఖ దుఃఖములయందుకాని లాభనష్టములయందు గాని, నిందాస్తుతులయందుగాని శీతోష్ణములయందుగాని సమత్వాన్ని భావించటమే సమాధి. అదే నిజమైన ధ్యానము వలన లభించే ఫలితము.

కనుక ఈనాడు పవిత్రమైన దినము. మీరందరు ఈవిధమైన ప్రాక్టీసు చేయ్యండి. తద్వారా

srisathyasaivachanamrutam

చదివే దానిలోకాని, ఇంకేవిధమైన ఆలోచన చేసే దానియందు కానీ చక్కని తీక్షణమైన శక్తి మీకు లభిస్తుంది. నేను కూడ దీనిని ఇంత వరకు ఎవరికీ చెప్పలేదు. దీని సాధన లోపల ఇంకా కొన్ని క్రమము లుంటున్నాయి. ఈ మనస్సు ఏకాగ్రత 12 సెకండ్లు వస్తువుపైన నిల్చటానికి మనం కూర్చునే విధానము, చేసే విధానములు కొన్ని ఉంటున్నాయి. అది ఇష్టమైన వ్యక్తులకు, చేయాలని ఆశించే విద్యార్థులకు నేను ప్రత్యేకంగా చెప్తాను. ధ్యానము చాలా సులభమైనది. సమాధి అంతకంటె సులభమైనది. కాని దాని క్రమమును తెలుసుకోలేకపోవటం చేతనే అనేక విధములైన అవస్థలకు గురైపోతున్నారు. ధ్యానమంటే పద్మాసనం వేసుకొని చక్కగా కూర్చోవటం మాత్రమే అని మీరు తెలుసుకుంటున్నారు. అదికాదు నిజమైన ధ్యానం. కూర్చుంటారు. కదలకుండా కూర్చుంటారు. మనస్సు ఎక్కడ పోతుండాదో వాళ్ళకే తెలియదు పాపం. ఒక చిన్న దోమ ముక్కుపై వాలితే తక్షణమే ఈ ధ్యానము చలించిపోతుంది. ఎప్పుడూ కూడా మనిషి చలించకుండా కూర్చున్నప్పుడు ఈ దోమలకు మరింత కుట్టేగుణము లేర్పడుతుంటాయి. అక్కడే అవి ప్రారంభమవుతాయి. మనం తోలినప్పుడు మళ్ళీ అక్కడే వచ్చివాలుతుంటాయి. మనం ఒకతూరి తోల్తాము. రెండవసారి కొంచెం వేగంగా తోల్తాము. మూడవసారి కోపం వచ్చేస్తుంది. రెండు చేతులతో దాన్ని చంపటానికి ప్రయత్నిస్తారు. ఇది ఈనాటి ధ్యానములో ఉండే విశేషము. ఈలాంటివన్నీ ధ్యానముకాదు.

ధ్యానమునకు ఒక సూక్ష్మమైన యుక్తి ఉంటుండాది. అదేశక్తి. అదేయోగం. ఈ సమాధి తత్త్వమనేదానికి ఆ పిల్లవాడు చెప్పాడు. ఉద్రేకాలు లేకుండా, శాంతంగా ఉండాలని. Patience మనం ఈరకంగానే సంపాదించాలి. ఈ patience ఒక్క ధారణవల్లనే మనకు లభిస్తుంది. దానివల్ల ఇంద్రియ నిగ్రహము ఏర్పడుతుంది. పవిత్రమైన భావనలుకూడను అభివృద్ధి అవుతూ ఉంటాయి. పవిత్రమైన భావనల చేతనే పరతత్త్వము ప్రాప్తిస్తుంది. కనుకనే భగవద్గీతలో

**శ్రేయోహి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానా ధ్యానం విశిష్యతే**
**ధ్యానాత్ కర్మఫల త్యాగః త్యాగా చ్ఛాన్తి రనంతరమ్.**

శాంతి శాంతి శాంతి ఇదే మనకు కావలసింది. ఈనాటి ధ్యానము మనకు కేవలం పూజరూము వరకు మాత్రమే పరిమితమై ఉంటుండాది. బయటకు వస్తూనే కసరటం, బుసరటం అనేక

srisathyasaivahini

రకములైన వికారాలంతా పొందుతుంటాము. కనుక సతతం యోగినః నిరంతరము యోగస్థితిలో ఉంటుండాలి. అనగా లౌకిక సంబంధమైన వ్యవహారములు ఇందులో మానమని కాదు. నీ చదువు నీవు చదువుకో. నీ కర్తవ్యాలను నీవు నిర్వర్తించుకో. దీనికేమాత్రము అడ్డుకాదు. కాని అన్నింటి యందు కూడను ఈ ధారణాశక్తి చాలా అవసరము. అప్పుడే ఇది నిజమైన ధ్యానమవుతుంది. ధ్యానమనగా దానిని చింతించటమే. మనము నిత్య జీవితములో అనుకుంటుంటాం. ఏదైనా చెబుతుంటే కొంతమంది వినకుండా ఉంటుంటారు. ఏమిరా నీవు దేనినో ధ్యానం చేస్తున్నావే? ఏ ధ్యానములో ఉన్నావని అంటాం. ధ్యానం అంటే యేమి? ఒక విషయాన్ని గురించి చింతించటమే ధ్యానం. ఆవిషయాన్నే, ఆ వ్యక్తినే, ఆవిషయమును మాత్రమే చింతించాలి. దానినే వేదాంతములో సాలోక్యము అన్నారు. ఆలోకములో ఉండటం.

సాలోక్యమనగా దేనిని మనంకావాలని ఆశిస్తున్నామో దాన్ని చింతించటం. ఏ విషయము కావాలంటే ఆ విషయాన్నే మనం చింతించటం. ఏవ్యక్తి నీకు కావాలో ఆ వ్యక్తి గురించి చింతించటం. అదే సాలోక్యము. సాలోక్యము. సా అనగా సత్యమైన తత్త్వము. అదే బ్రహ్మ. అదే దైవము. సకారమనే సర్వశక్తిమత్త్వమునకు సంబంధించినది. కనుక మానవత్వము లోపల అది ఇది నాది నీది అనుకుంటాంగాని అదియే మాత్రము కాదు. ఏదీ నీది కాదు. కానీ ఉన్న దొక్కటే నీది. అదే ఆత్మ. అదొక్కటే నీవు. అది నాది అనటానికి వీలులేదు. ఇలాంటి తత్త్వము ఒక్కధ్యానము చేతనే మనకు లభ్యమవుతుంది. అయితే ఈనాడు లోకములో చేసే అనేక రకములైన ధ్యానములంతా ఉంటున్నాయి. ఇవన్నీ అల్పమైన మార్గములు. దీని వలన ఏనాటికి దివ్యత్వాన్ని పొందలేరు. మొట్టమొదట చిత్తవృత్తిని నిరోధించాలి. అప్పుడే నిజమైన ధ్యానం మనకు లభ్యమవుతుంది. కూర్చోవటము, పద్మాసనం వేసుకోవటం, కన్నులు మూసుకోవటం ఈనాడు ధ్యానమనుకుంటారు. ఇది ధ్యానమే కాదు. ఇది రోగము.

**ధారణశక్తిని పొందండి**

విద్యార్థులు మొట్టమొదట ధారణాశక్తిని అభివృద్ధి పరచుకోండి. ఈ ధారణకు ఒకే వస్తువు పెట్టుకోండి. మీకిష్టమైన రూపాన్ని పెట్టుకోండి. లేదు రూపమే వద్దు. ఒక్కటేదైనా పదార్థమును పెట్టుకోండి. ఆపదార్థంపైనే 12 నిముషములు చలించని దృష్టితో చూస్తూరా. నేను పూర్వం

srisathyasaivachanamrutam

మీకు చెప్పాను. అంతర్ముఖంలో చూడటానికి మరొక మార్గం కూడా ఉంటుండాది. మనం కన్నులు మూసుకుంటే ఒక నల్లని చుక్క నిల్చిపోతుండాది. దానిని చూడాలనుకుంటే పరుగెత్తి పోతుంది. అది పరుగెత్తిపోకుండా నిలబెట్టినప్పుడే నీకు ధ్యానం లభ్యమవుతుంది. అదే నిజమైన ధ్యానము. ఆ చుక్కనే అజ్ఞానంలో ఉన్న ప్రజ్ఞానం, ప్రజ్ఞానంలో ఉన్న సుజ్ఞానం, సుజ్ఞానము నందున్న పరంజ్యోతి. అది ఎక్కడుంటుందంటే అశాంతిలోనే ప్రశాంతి, ప్రశాంతిలోనే ప్రకాంతి, ప్రకాంతిలోనే పరంజ్యోతి. పరంజ్యోతే పరమాత్మతత్త్వమని అశాంతిలోనే మనకు లభ్యమవుతుంది.

అంగము, జంగము, సంగము, లింగము ఈ నాల్గింటియొక్క స్థాయి లోపలనే ఆత్మతత్త్వమొస్తుంది. అంగము దేహము. సర్వాంగములతో కూడినది ఈ దేహము. ఈ అంగములో ఒక సంఘముంది. అది సొసైటీ. ఏమిటా సొసైటి? అక్కడ ఆరు మంది మెంబర్సు ఉంటున్నారు. వారే కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యములు. ఈ దేహములో ఆ ఆరుమంది చేరుతుంటారు. ఏ పనీ చేయించరు. ఒకరు ఒకదాన్ని ఆశిస్తే మరొకరు ఇంకోదాన్ని ఆశిస్తుంటారు. ఈ మీటింగులో ఏ ఒక్కదాన్నికూడా నిర్ణయం చేసుకోలేరు. ఈ సంఘములో జంగము అని ఒకడున్నాడు. అతనే ఈ సంఘాన్నంతా ఏకం చేస్తాడు. అదే జీవుడు. ఆ జీవతత్త్వము పరతత్త్వముయొక్క ప్రతిబింబమే. అతనే లింగము. లింగమనగా ఏమిటి? లీయతే గమ్యతే యితి లింగః అన్నారు. అతనికి ఆది అంత్యమేలేదు అన్నారు. లింగము ఉంటున్నాది. ఏ ప్రక్కన పెట్టియైనా పూజ చేసుకోవచ్చు. దానికి ఆదిలేదు అంత్యము లేదు. అది లింగము యొక్క ఆకారము. ఏవిధముగా చేసినప్పటికి ఫలితము మీకు వస్తుంది.

చాలామందికి తెలిసి ఉంటుంది. వర్షాకాలము వచ్చేటప్పటికి భూమి దున్ని విత్తనాలు వేస్తారు. ఈ విత్తనము ఏవిధంగా వేస్తే మొక్క వస్తుంది. ఏవిధంగా వేసినా సరే మొక్క వస్తుంది. కాబట్టి ఈధ్యానము లోపల భగవతత్త్వము ప్రేమతో నింపుకొని ఏరకంగా చేసినా అది ధ్యానమవుతుంది. సాలోక్యమే సామీప్యముగా వస్తుంది. సామీప్యమనగా ఏమి? అతిసమీపముగా వస్తుంది. సమీపముగా వచ్చినది సారూప్యముగా రూపొందుతుంది. చిన్న ఉదాహరణము. ఒకనది చక్కగా వేగంగా పరుగెత్తుతున్నది. అది సారూప్యము. అనగా ఇంతపెద్ద సముద్రముగా కనుపిస్తుంది కదా పెద్ద river అనుకుంటాము. కాని అది సముద్రముకాదు. సముద్రమువలె

srisathyasaivachanamrutam

కనుపిస్తున్నాదిగాని సముద్రము కాదు. సారూప్యం దాని రూపకముగనే కనుపిస్తున్నాది ఎప్పుడు సారూప్యముగా కనుపిస్తుంది. సామీప్యం సముద్రమునకు దగ్గరపోయినప్పుడే కనుపిస్తుంది. కారణం. ఈ సముద్రుడు ఒప్పుకునేవాడు కాదు. ఈ river కూడను నేను పోను అని అంటుంది. దీనిని సముద్రము నెట్టుతుంది. దీనినే ఆటుపోటు అంటారు. నది పోయి సముద్రములో చేరటానికి పోతుంది. సముద్రము నాలో చేరవద్దని గెంటివేస్తుంది. వెనుకకు వచ్చి అది సముద్రముగా కనుపిస్తుంది. దీనికి దానికి పన్నెండు గంటలే టైము. పన్నెండు గంటలు దీనికి దానికి పోరాటం జరుగుతుంది. రాత్రి ఆరుగంటలయ్యేటప్పటికి దానియొక్క భద్రతను, దీనియొక్క విశ్వాసమును, దీని యొక్క ప్రేమను గురించి యోచించుకొని పాపం నాలో చేరటానికి నీవు ఇంత తపిస్తున్నావు. వచ్చిచేరిపో అని అంటాడు. తాను పైకి వస్తాడు. నదిని లోపలికి తీసుకుంటాడు. నది సముద్రములో చేరుతున్నప్పుడు మీరు చూస్తే లోపల తీపి పైన ఉప్పునీరు. అదే జీవునికి దేవునికి ఉండే సన్నిహిత సంబంధము. వీడు చేరాలని పోతాడు. నీవు ఇప్పుడు రావటానికి వీలుకాదంటాడు. నేను ఉండలేనని వాడు ప్రతిజ్ఞ పట్టేస్తాడు. ఈ విధమైన కఠినమైన దీక్ష చేత మనసు కరిగి లోపల ప్రవేశింప జేసుకుంటాడు. ఈ ప్రవేశించటానికి మొట్టమొదట సాలోక్యము. అతని చింత చెయ్యాలి. అతని చింత తప్ప అన్యచింత ఉండకూడదు. నీపనులు నీవు చేసుకో. ఏపనులు చేసుకున్నా అతని చింత ఉండాలి. అప్పుడే సామీప్యం దగ్గరకు వస్తావు. దగ్గరకు వచ్చి సన్నిహిత సంబంధ బాంధవ్యము పెంచుకుంటాడు. క్రమక్రమేణా ఏమైపోతుందంటే సారూప్యము you and I are one అనే స్థితికి వస్తాడు. ఆ తరువాతనే సాయుజ్యము. రెండు ఒకటైపోతుంది.

**అన్ని మతముల సారము ఒక్కటే**

ఏ మతమునందైన, ఏ సిద్ధాంతమునందైన ఈ నాలుగు ఒకదానికొకటి సన్నిహిత సంబంధము ఉంటుండాది. తత్వములు వేరుగాని గమ్యము ఒక్కటే. అదే క్రిష్టియన్స్‌లో కూడా. జీసస్ మొట్టమొదట అదే చెప్పాడు. I am the messenger of God అన్నాడు. అనగా God వేరే ఉన్నాడు నేనొక messenger. కాని ఈ పరితాపము పెరుగుతూ పెరుగుతూ పోయింది. సాలోక్యములో చేరాడు. తదుపరి God is my father, I am

the son of God అన్నాడు. అనగా relationship పెరిగిపోతూ వచ్చింది. అంటే అతను తండ్రి ఇతను కొడుకు. వీరికి సంబంధము ఏర్పడిపోయింది. మూడవ step వచ్చేటప్పటికి I and my father are one అన్నాడు. One అనే స్థితికి సారూప్యానికి వచ్చేటప్పటికి Holy ghost అదే సాయుజ్యము. మహమ్మదీయులు దీన్నే చెప్తూ వచ్చారు. I am in the light. భగవంతుడు ఆకాశంలో ఉంటున్నాడన్నారు. లైట్ అంటే రెండర్థాలు. వెలుగని ఒకటి తేలిక అని మరొకటి. అదే పైనపోతే ether తేలికగా ఉంటుంది. కనుకనే I am in the light అన్నాడు. అనేటప్పటికి తాను తేలికగా మారిపోతూ వచ్చాడు. మరికొంత సాధన చేసేటప్పటికి light is in me అన్నాడు. ఆ లైటునాలోనే ఉంటున్నది. ఇదేసామీప్యం. Third దీనికొచ్చేటప్పటికి I am the light అన్నాడు. ఇదే సారూప్యము. There is no weight ఇదే సాయుజ్యం. కనుకనే

**అన్ని మతములు నిన్నె చూపును**
**అన్ని మూర్తులు నీదు రూపులె**

భారతీయుల వేదాంతమునందు కూడను అదే బోధిస్తూ వచ్చారు. ద్వైతము, విశిష్టాద్వైతము అద్వైతము. ప్రతి మతమునందు ఈ మూడు ఎవ్వరు విడదీయటానికి వీలుకాదు.

విద్యార్థులారా! మనిషి పవిత్రత ఎటువంటిది అనేది విచారణ చేసి మీరు వినియోగించుకోవాలి. ఈ విచారణకూడను వివేకంతో చేయాలి. కేవలం విజ్ఞానాన్ని ప్రవేశపెట్టకూడదు. విజ్ఞానం వేరు. వివేకం వేరు. ఎంతటి విజ్ఞానమైనను వివేకం లేకపోతే నిరుపయోగమైపోతుంది. ప్రమాదం వచ్చేస్తుంది. కనుక వివేకం ఉండినప్పుడే విజ్ఞానంకూడ ఉపయోగమవుతుంది. వివేకానికి వినయం కావాలి. ఈ వినయమే విద్యయొక్క ప్రధానమైన ప్రాణము. ఇవన్నీ ఆధ్యాత్మికం చేతనే కట్టుబడి ఉంటుండాయి. ఇవన్నీ అర్థం కావటానికి మొట్టమొదట మీరు ధారణము ప్రాక్టీసు చేయండి.

ఇది ఎప్పుడు చెయ్యాలి? కాలములో కూడను సత్వరజస్తమో గుణాలుంటున్నాయి. భూమిలో కూడను సత్వరజోతమోగుణాలుంటున్నాయి. చూడండి. గాలి సాత్వికము. అది భూమినుంచి ఆవిరిగా పోతుండాది. ఇంక రాజసికము. రాజసిక మనేది లిక్విడ్. రాజసికమనగా

కదులుతూ ఉండటమన్నమాట. అనేకరకముల చలించటం. తామసికము ఉంటుండాది. తామసికము జడము. తామసికమనేది ఫిజిక్సు మెటీరియల్. రాజసికమైనది కెమిస్ట్రీ. ఈ రెండింటియొక్క సంబంధముతో కూడినదే సాత్వికము. అదే అన్నిటికిని సృష్టికారకముగా ఉంటుండాది. అదే బయోసైన్సు. ఈ మూడింటియందు ఈవిధములైన గుణములుంటున్నాయి. కాలములో కూడ మూడు ఉంటున్నాయి. ఇక్కడ రాత్రి 8 గంటలు మొదలుకొని తెల్లవారుజామున 4 గంటల వరకు ఎనిమిది గంటలు తామసికమైన టైము. ఇప్పుడు పశువులు, పక్షులు కూడ నిద్రిస్తాయి. ఇది దయ్యాల కాలమని అంటారు. రాక్షసులకిది చాలా బలమైనది. తామసిక వృత్తులకిది చాలా పటుత్వమైనది. తెల్లవారి ఎనిమిది గంటలు మొదలుకొని సాయంకాలము నాలుగు గంటల వరకు రజోగుణ సంబంధమైన కాలము. ప్రతి ఒక్కరు కూడను పనులు ప్రారంభిస్తారు. అధికారులు, ఆఫీసర్లు 8 గంటలనుంచి 4 గంటల వరకు ఆఫీసులకు వెడతారు. అంతా పనులు చేసేటైము అది. ఆ 8 గంటలు రాజసికము. తెల్లవారుజాము 4 గంటలనుండి 8 గంటలవరకు 4 గంటలు, సాయంకాలము 4 గంటలనుండి 8 గంటలవరకు 4 గంటలు. ఈ నాలుగు ఆ నాలుగు 8. సాత్వికము 8. రాజసికము 8. తామసికం 8 గంటలు. 8 **X** 3 = 24 గంటలు కరెక్టుగా సరిపోయింది.

**మీ ఆలోచనలే మీకు పవిత్రతనిస్తాయి**

తెల్లవారి 4 గంటలనుండి సాత్వికం ప్రారంభమవుతుంది. అప్పుడే మనమంతా లేచిఉండాలి. ఈ సాత్విక కాలము లోపల మనసాధనలో, మనస్టడీనో ప్రారంభించాలి. అప్పుడే పవిత్రమైన స్థితి. అప్పుడు లేచి స్నానము చేసి ఇంద్రియములను లేపి నీవు కూడను గలీజులోపడి ఈ విధంగా ఉండనక్కరలేదు. స్నానము చేయనక్కరలేదు. ఆ సమయంలో చాలా శాంతంగా ఉంటుంటాయి ఇంద్రియాలు. విశ్రాంతి తీసుకొని ఉంటాయి. ఆ విశ్రాంతి లోపల నీవు దేనిని చింతించినా చాలా సూటిగా చేరిపోతుంటాది భగవత్తత్వము. మరచిపోయిన విషయాలు అప్పుడే జ్ఞాపకం వస్తుంటాయి. ఆ సాత్వికమైన టైము లోపలనే మీరు ప్రార్థనలు ప్రారంభించాలి. అబ్బా 4 గంటలకు 5 గంటలకు లేవటానికి వీలుకాదని 8 గంటలకంతా లేస్తారు. ఇంకా కొంతమంది పిల్లలు ఇక్కడకు రాక మునుపు 9 గంటలకు లేచి ఆ పాచిముఖంతోనే స్కూలుకు



srisathyasaivachanamrutam

వెళ్లిపోయేవారు. వీరు కేవలం కుంభకర్ణుని సోదరులు. 4 గంటలకు లేచి కాలకృత్యాలు తీర్చుకోండి. కాళ్లు ముఖం కడుక్కోండి. కూర్చోండి ఆనందంగా, ఎందుకోసం ముఖం కడుక్కోవాలంటే నిద్రరాకుండా నిమిత్తమే ముఖం కడుక్కోమనేది. ఈ విధమైన సూక్ష్మమైన విషయాలు గుర్తించుకుంటే ధ్యానం అతి సులువుగా కుదిరిపోతుంది.

సాయంకాలం కూడను అంతే కాలేజి నుండి వస్తావు. 4 గంటలనుంచి 9 గంటలవరకు టైము ఉంటుండాది. ఆటలాడుకో, గేమ్సు నేర్చుకో. కాని 6 గంటలకు నీవు పోయిన తరువాత కాళ్ళు చేతులు కడుక్కొని ఒక ఐదునిముషాలైనా కూర్చో. రెండు నిముషముల 24 సెకన్లే ఉంటుండేది ధ్యానం. నువ్వేం పెద్ద గంటలకొద్దీ కూర్చోనక్కరలేదు. ఆ విధంగా చేస్తుంటే ఎంత పవిత్రంగా మారుతుంది? నిజంగా ఆ విధంగా చేసి చూడండి మీ ఆనందము మీకే తెలుస్తుంది. మీపవిత్రత ఎంతనో అభివృద్ధి అవుతుంది. ఈనాడు మీరు నిరంతరము పిచ్చిభావాలు, పిచ్చి ఊహలలోనే పోతున్నారు. కనుక ఆ ముఖాలు చూస్తే ఏదో ఒకవిధంగా ఉంటుంటాయి. జబ్బు వచ్చిన వారి ముఖాలుగా ఉంటుంటాయి. అక్కడ ఏ తేజస్సు ఉండదు. పవిత్రతే తేజస్సుకు మూలకారణము. లోపల పవిత్రత ఉంటుంటే ముఖవర్చస్సు ఎంత తేజంగా ఉంటుంది. ఒక చిన్న ఉదాహరణ. చూడండి. నాకు 46 ఏండ్లు. నేనెట్లున్నాను. మీరు 16 ఏండ్ల పిల్లలు. ఎట్లున్నారు? తేజస్సు లేకుండా పోవటానికి కారణం ఏమిటి? మీ థాట్స్. మీ అపవిత్రతే దీనికి కారణము. కనుక పవిత్రతను మీరు పోషించుకోండి. ఈ పవిత్రత ఎంత పెరుగుతుందో అంత మీరు యువకులుగా ఉంటారు. ఏ రోగములు మీలో ప్రవేశించవు. దానిని మీరు సాధించండి. అన్నింటిని ప్రేమ చేతనే సాధించండి. అది లేకపోతే దేనిని సాధించటానికి వీలుండదు.

ఈ ధారణ, ధ్యానము, సమాధి తత్త్వాన్ని తెలుసుకోవాలనేవారు, లేక దీనిని ప్రాక్టీసు చేయాలని ఆశించేవారు తరువాత మీకందరికి విడివిడిగా నేను చెప్తాను. ఇది చాలా అవసరం మన ఇన్స్టిట్యూట్‌లో ఈ భౌతిక విద్యలతో బాటు ఆధ్యాత్మిక అమృతాన్నికూడను మీరు ఆరగించాలి. చాలా వాటిపైన శ్రద్ధా భక్తులు అభివృద్ధి పరచి మీ జీవితములో ప్రధానమైన సబ్జెక్ట్‌గా నిర్ణయించుకోండి. ప్రతిదినము ఈవిధమైన సమావేశము జరపటంచేత అనేకమంది

srisathyasaivahini.org

భక్తులకు కొంత అననుకూలంగా ఉంటుండాది. పాపం తెల్లవారిమాత్రమే వాళ్ళకు ఇంటర్వ్యూలంతా ఇస్తున్నాను. సాయంకాలం లేకపోవటం చేత చాలామంది నిరాశతో వెళ్ళిపోతున్నారు. కనుక ఇకపైన బేస్తవారము, ఆదివారములు మాత్రమే ఈ సమావేశములు మనం పెట్టుకుందాం. నా కాలమంతా 3 భాగములు మీకే ఇస్తున్నాను. ఈ ఉన్న ఒక భాగము మీకు ఇస్తే వాళ్లగతి ఏమౌతుంది? నిజంగా వారికే ఎక్కువ భక్తి శ్రద్ధలంతా. ఎంతో దూరంనుంచి ఎన్నోవేలు ఖర్చుపెట్టుకొని ఎన్నో శ్రమలకోర్చి, ఎన్నో అననుకూలములంతా అనుభవించి స్వామికోసమని కాచుకొని ఉంటుంటారు పాపం. కనుక వారికికూడను ఆనందాన్నందించవలసిన బాధ్యత నాకుంది. ఇంక మున్ముందు ఒక బేస్తవారము, ఒక ఆదివారము మాత్రమే మన సమావేశాలు.

**(తేది. 29-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam